క్లుప్తంగా

విష జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యులు

మల్లాపూర్: విషజ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు డ్రెయినేజీల్లో మందు చల్లించాలన్నారు. అనంతరం పాఠశాలలో 125 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 28 మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, ల్యాబ్ టెక్నీషన్ ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ సుమ, ఏఎన్ఎం అంజమ్మ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ గర్జన సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: ఈనెల 6న వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే యువ గర్జన సభ విజయవంతానికి బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. శనివారం కథలాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 6న వేములవాడ పట్టణంలో గుడిచెరువు కట్ట వద్ద జరగనున్న సభకు గ్రామానికి వంద మంది చొప్పున యువకులు హాజరుకావాలని, దీని కోసం పార్టీ శ్రేణులు యువకులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, యూత్ మండలాధ్యక్షుడు నల్ల గంగాధర్, గడ్డం భూమరెడ్డి, శ్రీధర్, దాసరి గంగాధర్, ఏజీబీ మహేందర్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే శిక్షణ



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్

ఇబ్రహీంపట్నం : ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతైన అవసరం అని కస్తూరిబా గాంధీబాలికల గురుకుల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ రజిత అన్నారు. సమగ్ర సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా బాలికలకు కరాటే శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ బాలికలకు తమను తాము రక్షించుకోవడానికి ఈ విద్య ఎంతో దోహదపడుతుందని, విద్యార్థులు కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కొరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్‌కుమార్, పీఈటీ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్గసాగర్‌ను మండలంగా ప్రకటించాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ కు చెందిన పలువురు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణ శివారులో ఈ నెల 3 న జరిగిన బహిరంగసభలో సీఎం కేసీఆర్ బండలింగాపూర్‌ను మండలంగా ఏర్పాటు చేశామని చెప్పారని, బండలింగాపూర్ పరిధిలో తమ గ్రామాన్ని చేర్చవద్దన్నారు. జగ్గసాగర్ కేంద్రంగా మండలంగా ప్రకటించాలని లేనిపక్షంలో మెట్‌పల్లి మండలంలోనే తమ గ్రామాన్ని కొనసాగించాలని కోరారు. ఈ విషయంపై అధికారులకు వినతిపత్రం ఇచ్చామని కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదన్నారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రాజారెడ్డి, గంగాధర్, లింగారెడ్డి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని పోతారం, సిరికొండ, కథలాపూర్, దూలూర్, బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం నరహరి శనివారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు రాజేందర్, విజయనిర్మల, గ్రామైక్య సంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట అడ్డగోలు దోపిడీ

- అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
- కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని రెవెన్యూ, గనులశాఖ అధికారులు



అక్రమంగా ట్రాక్టర్‌లో మట్టిని తరలింపు



ట్రాక్టర్‌లో మట్టి నింపుతున జేసీబీ

వెల్గటూర్: అనుమతులు లేకున్నా.. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు అక్రమార్కులు. మండలంలో ఈ దందా జోరుగా సాగుతోంది. సాధారణంగా మట్టి తవ్వకాలు చేపట్టడానికి రెవెన్యూ, గనుల శాఖ అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి నిర్ణీత పన్ను చెల్లించిన అనంతరం మట్టి తవ్వకాలు జరపాలి. కానీ వీరికి అవేమీ పట్టవు. అధికార పార్టీ నేతల అండదండలతో అభివృద్ధి పనుల పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా మట్టిని తవ్వుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు.

అభివృద్ధి పనుల పేరుతో దోపిడీ

అభివృద్ధి పనుల పేరుతో కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా గుట్టలు తవ్వుతూ ప్రకృతి సంపద కొల్లగొడుతున్నారు. ఎండపల్లి మండలం గుల్లకోట క్రాస్ రోడ్డు నుంచి చెర్లపల్లి, జగదేవుపేట, రాజక్కపల్లి మీదుగా వెల్గటూర్ మండల కేంద్రంలోని 7వ నెంబర్ రాష్ట్ర రహదారి వరకు 5.14 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 10 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రోడ్డు పనుల కాంట్రాక్టు పొందిన సదరు కాంట్రాక్టర్ గుల్లకోట క్రాస్ రోడ్డు నుంచి జగదేవుపేట ఎస్సీ కాలనీ వరకు ఎటువంటి అనుమతులు లేకుండా జగదేవుపేట సమీపంలో అక్రమంగా జేసీబీతో గుట్టలు తవ్వుతూ కొన్ని వేల ట్రిప్పుల మట్టిని రోడ్డుకు ఇరువైపులా కుప్పలుపోశాడు.అధికార పార్టీ నేతల అండదండలతో కోట్ల రూపాయలు కొల్లగొడుతూ ప్రకృతి సంపద దోచుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడు. ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల కాంట్రాక్టులు పొంది, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రకృతి సంపద కొల్లగొడుతున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

అభివృద్ధి పనులకైనా, మరే ఇతర అవసరాల కోసమైనా మట్టి తవ్వకాలు చేపట్టడానికి రెవెన్యూ, గనులశాఖ అనుమతులు తప్పనిసరి. కానీ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపద దోచుకుంటున్నా అధికారుల చర్యలు మాత్రం శూన్యం. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలపై జగిత్యాల గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను సాక్షి ప్రతినిధి వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని ఇంతకు మించి మావద్ద ఎటువంటి సమాచారం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. ప్రజల కట్టిన పన్నులతో కోట్ల రూపాయల కాంట్రాక్టులు పొంది, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రకృతి సంపద ధ్వంసం చేస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులివ్వలేదు



మండలంలో మట్టి తవ్వకాల కోసం ఎవ్వరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరపడం చట్టరీత్యా నేరం .అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటాం.

– శేఖర్, తహసీల్దార్, వెల్గటూర్

ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం

కోరుట్ల: పట్టణ శివారులోని అయోధ్యపట్నంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే కోరుట్ల అబివృద్ధి జరిగిందని, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు 15 ఏళ్లలో చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రేచపల్లిలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ఇంటింటా ప్రచారం చేశారు. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుంటి గంగారాం శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో చేరిన రిటైర్డ్ అడిషనల్ పీపీ

జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ అడిషనల్ పీపీ రవీందర్, హైకోర్టు న్యాయవాది సాయికుందన్ శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



రేచపల్లిలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయికల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మున్ను, దివాకర్‌రెడ్డి, శ్రీకాంత్, రాకేశ్, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో లంబాడిపల్లి సర్పంచ్ చేరిక

మల్యాల: మండలంలో లంబాడిపల్లి గ్రామ సర్పంచ్ కట్కూరి తిరుపతి 40 మంది బీఆర్ఎస్ నాయకులు శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. లంబాడిపల్లి సర్పంచ్ కట్కూరి తిరుపతితోపాటు బీఆర్ఎస్ నాయకులు ముత్యాల నర్సింహారెడ్డి, మిట్కూరి గంగారెడ్డి, కట్కూరి సురేశ్. మరో 40మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, శనిగరపు తిరుపతి, లక్ష్మణాచారి, ఎంపీటీసీ రవళి వంశీ, మ్యాక సాయి పాల్గొన్నారు.

అడ్లూరి నామినేషన్‌కు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నామినేషన్ సందర్భంగా వెల్గటూర్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి సర్పంచ్ మేరుగు మురళి, ఉపసర్పంచ్ సందీప్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీకాంత్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేష్ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో ధర్మపురి తరలివెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేయడంతో ఆయనకు మద్దతుగా పెగడపల్లి నుంచి పలు వాహనాల్లో అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు శోభారాణి, శంకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి,పాల్గొన్నారు.

‘బీజేపీని విమర్శించక పోవటం విడ్డూరం’

కోరుట్ల రూరల్: సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుక్రవారం కోరుట్ల పర్యటనలో బీజేపీపై ఒక్క విమర్శ కూడా చేయకపోవటం విడ్డూరంగా ఉందని సీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలకు అర్థమైందన్నారు.ముఖ్యమంత్రి కోరుట్లకు వచ్చి నియోజకవర్గ ప్రజలకు నిరాశ మిగిల్చారన్నారు. కోరుట్లకు ఏమైనా వరాలు ప్రకటిస్తారేమోనని ఆశతో సీఎం బహిరంగ సభకు భారీగా జనం వచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని, గల్ఫ్ కార్మికులు, చెరుకు రైతుల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్: మండలంలోని ఎఖీన్‌పూర్, నాగులపేట, సంగెం, రామరావుపల్లె, మేడిపెల్లి మండలం వల్లంపెల్లి, మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కోరుట్ల ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో శనివారం రూ.50వేల మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన షేక్ కాశీం మెట్‌పల్లి నుంచి కారులో మద్యాన్ని గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జోరందుకున్న బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

పెగడపల్లి: మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పార్టీ అభ్యర్థి ఈశ్వర్ గెలుపు కోసం పార్టీ నాయకులు గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతూ మంత్రిగా ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు రాబట్టేందుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాయకులు రామబద్రునిపల్లి, ఏడుమోటలపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేసి ఈశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంజయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించండి.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శనివారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా సంజయ్‌ను గెలిపిస్తూ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు వస్తాయని కరపత్రాలను ప్రజలకు పంచుతూ ప్రచారం చేశారు.

మండలాల్లో ఇంటింటి ప్రచారం

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం రాయికల్ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.మరోసారి బీఆర్ఎస్ గెలిపించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, మార్కెట్ కమిటి డైరెక్టర్ ఇర్ఫాన్, ఓదెలు, ఉదయశ్రీ పాల్గొన్నారు.



రాయికల్ ప్రచారం చేస్తున్న నాయకులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు శనివారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం

ధర్మపురి: బహుజన సమాజ్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో నంది కూడలి వద్ద శనివారం తన ప్రచార రథంపై ప్రసంగించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడుతున్న బీఎస్పీ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. గత పాలకుల హయాంలో ధర్మపురిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ధర్మపురిలో అన్ని విధాల అభివృద్ధి కేవలం బీఎస్పీతోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కైరి శంకర్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి విజయ్‌కుమార్

ఘనంగా శత చండీయాగం

జగిత్యాలటౌన్: లోక కళ్యాణార్థం చేపట్టిన శతచండీ యాగం ఘనంగా ప్రారంభమైంది. తిగుళ్ల విషుశర్మ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో ఈనెల 9వరకు కొనసాగనున్న శత చండీయాగం ప్రారంభమైంది. యాగం ప్రారంభానికి ముందు దుర్గాదేవి, గణపతి, పరమశివుడి విగ్రహాలను మేళతాళాలు, వేదమంత్రోచ్ఛారాణల నడుమ ఊరేగింపుగా యాగ స్థలికి తరలించారు. శోభాయాత్ర సందర్భంగా మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



చండీ యాగానికి తరలివస్తున్న అమ్మవారు

రైతు కుటుంబానికి బాసటగా ఉంటాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రైతు గంగారెడ్డి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ. 10వేలు అందించి, అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీకృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ మృతుడి కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. తాళ్లధర్మారం గ్రామానికి చెందిన జైకిసాన్ రెడ్డి సంఘం సభ్యులు రూ.25వేల నగదు, ఒక బియ్యం బస్తాను అందించారు.



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

‘టికెట్ రాలేదని కార్యకర్తలు ఆందోళన చెందొద్దు’

మెట్‌పల్లి: తనకు కాంగ్రెస్ టిక్కెట్ రాలేదని కార్యకర్తలు ఆందోళన చెందవద్దని సుప్రీంకోర్టు న్యాయవాది, ఆ పార్టీ నాయకుడు కొమొరెడ్డి కరం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. టికెట్ ఇవ్వకపోయినప్పటికీ భవిష్యత్తులో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అధిష్టానం పెద్దలు హామీ ఇచ్చారన్నారు. పార్టీ ఆదేశాలకనుగుణంగా వచ్చే ఎన్నికల్లో కోరుట్లలో కాంగ్రెస్ గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిట సత్యంరెడ్డి నాయకులు విజయ్‌అజాద్, ఎర్రొళ్ల హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరం

సంక్షిప్త వార్తలు

గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్, వర్షకొండ గ్రామాల్లో శనివారం కోరుట్ల బీజేపీ ఎమ్మెల్యేగా ధర్మపురి అర్వింద్ పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాలను పంచుతూ ప్రజలకు వివరించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నిజామాబాద్ పార్లమెంటరీ జాయింట్ కన్వీనర్, మండల ఇన్‌చార్జి గుంటుక సదాశివ్, బీజేపీ మండల అధ్యక్షుడు జక రయ్య, ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, వెంకటేశ్‌యాదవ్, కార్యదర్శి దగ్గుల అశోక్, బీజేవైఎం మండల అధ్యక్షులు నవీన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు గడ్డం సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. మేడిపల్లి ఉపసర్పంచ్ నాగరత్నాకర్, ఎంపీటీసీ నగేశ్ పాటు మరికొందరికి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజే పీ నాయకులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గుంతలు పూడ్చివేత

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లోని బస్ స్టేజి వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను శనివారం శ్రమదానంతో పూడ్చివేశారు. గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పెంబట్ల గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్ ఆధ్వర్యంలో శ్రమదానంతో పాటు మరికొంత సొమ్మును వెచ్చించి గుంతలు పూర్తిగా పూడ్చివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వయో వృద్ధులు ఓటింగ్‌లో పాల్గొనాలి

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి వయోవృద్ధులు తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగులు, 80 ఏళ్ల పైనున్న వారికి అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. 12 డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, విజయ్ పాల్గొన్నారు.

దుర్గాదేవీ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెంలో శనివారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగారాజం, వెంకటి, కిషాన్, రాములు, మామిడి చంద్రయ్య, మురళి,ఎర్రయ్య స్థలం దానం ఇవ్వగా, సర్పంచ్ సింగిరెడ్డి నరెశ్ రెడ్డి, కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ , చెన్నమనేని వికాస్, గోలి మోహన్ , గుగ్గిళ్ళ రవిగౌడ్, చెన్నమనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం రద్దును ఖండిస్తున్నాం

మల్యాల: మల్యాల, కొడిమ్యాల మండలాల ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాన్ని కొన్ని రాజకీయ పార్టీలు రద్దు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు అన్నారు. ఏటా ట్రస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, మేనేజ్‌మెంట్, విద్యార్థులతో ఉపాధ్యాయుల బాధ్యతలపై శిక్షణ నిర్వహిస్తున్నామని, శనివారం 300 మంది ఉపాధ్యాయులతో మల్యాలలో శిక్షణ నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నామన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో తమ బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ రాజేశ్ తెలిపారు. శనివారం మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి ,బర్తీపూర్, మూలరాంపూర్ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ప్రతి నెల వచ్చే విద్యుత్ బిల్లులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు ఏ విధంగా చెల్లించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

రాయికల్: మండలంలోని కొత్తపేటలో రాజరాజేశ్వర నాగాలయం, రాయికల్‌లోని ఆంజనేయస్వామి ఆలయ హుండీలను శనివారం లెక్కించారు. నాగాలయ హుండీ ఆదాయం రూ.2,35,069, రాయికల్‌లోని హనుమాన్ ఆలయం రూ.76,033 వచ్చినట్లు ఈవో విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాజేశ్వరశర్మ, సర్పంచ్ బత్తిని రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్లు ప్రవీణ్, సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

బీజేపీ మండల అధ్యక్షుడిగా గోపతి జనార్ధన్

వెల్గటూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా పాశిగామకు చెందిన గోపతి జనార్ధన్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ బీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఎడ్ల రాజం

రాయికల్: బీజేపీ బీసీ మోర్చా మండల ఉపాధ్యక్షుడిగా భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రాజంను నియమించినట్లు శనివారం మండల అధ్యక్షుడు అన్నవేని వేణు తెలిపారు.

ఉపాధి రంగాల్లో రాణించేలా యువతను ప్రోత్సహిస్తాం

కథలాపూర్: యువత ఉపాధి రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని బీఎస్పీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి గోలి మోహన్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం బొమ్మెనలో బీఎస్పీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను కొన్ని రాజకీయపార్టీలు వాడుకొని వదిలేశారని, చదువుకున్న యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధనవంతులే అభివృద్ధి చెందారని, పేద, మధ్యతరగతి కుటుంబాలు మరింత వెనుకబడి పోయారన్నారు. పేదల సంక్షేమం కోరే బీఎస్పీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల బాధ్యుడు తెడ్డు శేఖర్, మండలాధ్యక్షుడు పాటేటి అర్జున్, బాలె నీలకంఠం , పాతిపు సంజీవ్, బాలె మహేష్, గంగనర్సయ్య, వంశీ, నితిన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.